ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట


గ్రామస్తులకు పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి


గిరిజనులకు పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ


పైడిపుట్టలో గ్రామస్తులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

- గడప గడపకు అనూహ్య స్పందన
- ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, పాల్గుణ, ధనలక్ష్మిలకు గిరిజనుల ఘన స్వాగతం

గూడెంకొత్తవీధి: పేదల ఆర్థిక సుస్థిరతే ప్రధాన ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని రింతాడ -2 సచివాలయం పరిధిలోని జంగంపాడు, పెదపాడు, పారికలు, దుచ్చరిపాలెం, గ్రామాల్లో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ఎమ్మెల్యే వివరించారు, సమస్యలపై ఆరా తీశారు. గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ జగనన్న పాలనలోనే ప్రజా సంక్షేమం, అభివృద్ధి సాధ్యమవుతోందన్నారు. మునుపెన్నడూ లేని విధంగా గిరిజన ప్రాంతాభివృద్ధి జరుగుతోందన్నారు. శివారు గ్రామాల్లోనూ మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు మంజూరు చేస్తోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీపీ కుమారి, జెడ్పీటీసీ శివరత్నం, వైస్ ఎంపీపీలు ఆనంద్, దేవుడు , సర్పంచ్ లక్ష్మి, మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్, ఏఎంసీ డైరెక్టర్ త్రిమూర్తులు, నాయకుడు వీరేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు పేదలకు వరం

అరకులోయ రూరల్: ప్రభుత్వ పథకాలు పేదలకు వరం అని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు, మండలంలో మారుమూల పంచాయతీ ఇరగాయి పరిధిలో ఉన్న టీడీ గూడ, ఉరుములు, వలిదిపనస తదితర గ్రామల్లో గురువారం అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో 241 గడపలను ఆయన సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ పార్టీలకతీతంగా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలకు మించి ప్రజలకు పథకాలు అందిస్తున్నారని స్పష్టం చేశారు. విద్య, వైద్యానికి ప్రభుత్వం ప్రత్యేక చొరవతో అభివృద్ధి చేస్తోందన్నారు. కార్పొరేట్‌కు దీటుగా నాడు-నేడు నిధులతో ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చేసి నాణ్యమైన విద్య అందిస్తోందన్నారు. సచివాలయం, గ్రామ వలంటీర్ల వ్యవస్థతో ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంక్షేమ పథకాల అమలుతో దేశంలోనే ఆదర్శవంతమైన సువర్ణ పాలనను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని స్పష్టం చేశారు. ఎంపీపీ ఉషారాణి, పార్టీ యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్, ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ అధికార ప్రతినిధి శెట్టి అప్పాలు, మండల కన్వీనర్ పట్టాసి సంపత్‌కుమార్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రమేష్, సర్పంచ్ బుట్కి, నాయకులు రంజిత్‌కుమార్, రమేష్, గురుమూర్తి, సాంబ, యాజీన్, సోమేష్, నర్సింగ్, గోపాల్ పాల్గొన్నారు.

ప్రజాశ్రేయస్సే పరిపాలనకు పరమార్థం

అడ్డతీగల: ప్రజాశ్రేయస్సే పరిపాలనకు పరమార్థంగా మార్చి పేద బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. అడ్డతీగల మండలం పైడిపుట్టలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజాసమస్యలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వాటి ప్రయోజనాలను ఎమ్మెల్యే ధనలక్ష్మి ఆ గ్రామ గిరిజనులకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ ఏళ్ల తరబడి కొండ కోనల్లో సాగు చేసుకుని జీవించే గిరిజనులకు అటవీ భూములపై హక్కు కల్పించి వేలాది ఎకరాల భూములకు పట్టాలు ఇచ్చిన ఘనత సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. ప్రాజెక్టుల నిర్మాణాల వల్ల ఇళ్ళు,భూములు కోల్పోయిన ప్రతి ఒక్కరికీ పార్టీలకతీతంగా పునరావాసం కల్పించారన్నారు. విద్యా రంగంలో పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు అందుబాటులోనికి తీసుకొచ్చి పెను మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. గిరిజనుల చెంతకు కార్పొరేట్ వైద్యం అందిస్తున్నారన్నారు. ప్రతి ఆస్పత్రిలో ఇద్దరేసి వైద్యులను అందుబాటులో ఉంచి పూర్తిస్థాయిలో వైద్యం అందేలా చర్యలు తీసుకున్నారన్నారు. పేద వర్గాల ప్రజలకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఆర్థికంగా చేయూత ఇస్తున్నారన్నారు. ఎంపీపీ బొడ్డపాటి రాఘవ, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు కారు రాంబాబు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థులకు కబడ్డీ పోటీలు


కబడ్డీ పోటీల్లో విద్యార్థులు

డుంబ్రిగుడ: మండల కేంద్రంలో ఉన్న శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాల నిర్వహణలో భాగంగా గురువారం గ్రంథాలయాధికారి శెట్టి సునీత ఆధ్వర్యంలో విద్యార్థిని, విద్యార్థులకు కబడీ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు కూడా అందజేస్తామన్నారు. ఈ వేసవి విజ్ఞాన తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె అన్నారు.

నేడు మండల సమావేశం

మారేడుమిల్లి: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఎంపీపీ సార్ల లలిత కుమారి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో బి.అశోక్ కుమార్ గురువారం తెలిపారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, ఆయా శాఖ అధికారులు తప్పక హాజరుకావలని కోరారు.

అందుబాటులో వరి విత్తనాలు

రాజవొమ్మంగి: మండలానికి ఈ ఏడాది ఖరీఫ్‌కు గాను 90 శాతం సబ్సిడీపై గిరిజన రైతులకు సరఫరా చేసేందుకు 1200 క్వింటాళ్ల వరి విత్తనాలు అందుబాటులో ఉన్నట్టు స్థానిక వ్యవసాయాధికారి రమేష్‌నాయుడు తెలిపారు. వాటిని ఆయా క్లస్టర్ రైతు భరోసా కేంద్రాల్లో భద్రపరిచామన్నారు. విత్తనాలు మొలకట్టి ప్రజాప్రతినిధుల చేతులమీదుగా త్వరలోనే రైతుకు పంపిణీ చేయనున్నట్టు పేర్కొన్నారు. ప్రభుత్వం సరఫరా చేసిన వరి విత్తనాలో ఎంటీయూ 1064, ఎంటీయూ 1121, ఎంటీయూ 1318, ఎన్ఎల్ఆర్-34449 వంగడాలు ఉన్నాయన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు తమ వద్ద గల ఆధార్‌కార్డు, పట్టాపాసు పుస్తకాలు చూపించి రైతు పేరును సమీపంలోని రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు.

విద్యార్థులకు కరాటేలో శిక్షణ


కరాటే శిక్షణలో విద్యార్థులు

జి.మాడుగుల: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులకు పుస్తక పఠనం, కరాటేలో శిక్షణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మాస్టర్ సాగేని రాజేష్ అధ్వర్యంలో విద్యార్థులకు కరాటేలో మెలకువలు నేర్పారు. శాఖా గ్రంథాలయ అధికారి వంపూరి మహేశ్వరరావు, చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జీసీసీ హమాలీల నిరసన


నిరసన తెలుపుతున్న హమాలీలు

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని జీసీసీ కార్యాలయం వద్ద హమాలీలు గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కలాసీల సంఘం కార్యదర్శి పరశురాం మాట్లాడుతూ కార్మికులకు ఏరియర్స్ బకాయిలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, యూనిఫాంలు అందజేయాలని కోరారు. పని ప్రదేశాల్లో తాగునీరు, మరుగుదొడ్ల సౌకార్యం కల్పించాలన్నారు. చందు, నానాజీ, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌ను పరామర్శించిన పోలీసులు


రామారావును పరామర్శిస్తున్న ఎస్‌ఐ షరీఫ్

రాజవొమ్మంగి: అనారోగ్యానికి గురై జడ్డంగి పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న లోదొడ్డి సర్పంచ్, రాష్ట్ర గిరిజన సంఘం అధ్యక్షుడు లోతా రామారావుని గురువారం జడ్డంగి ఎస్‌ఐ షరీఫ్‌తో పాటు సిబ్బంది పరామర్శించారు. కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆయనకు వైద్యాధికారి సుజి చికిత్స అందజేస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ షరీఫ్ మాట్లాడుతూ మెరుగైన వైద్యం అందించాలని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

అధికారులు జవాబుదారీతనంతో పనిచేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సీతమ్మ

ముంచంగిపుట్టు: మండల స్థాయి అధికారులు ప్రజలకు జవాబుదారీతనంతో పనిచేయాలని ఎంపీపీ అరిసెల సీతమ్మ అన్నారు. మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ అరిసెల సీతమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది. శాఖల వారీగా మండల స్థాయి అధికారులు జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించారు.ఎంపీటీసీలు, సర్పంచ్‌లు మాట్లాడుతూ ఇంటర్మీడియట్, పదో తరగతి పరీక్షల్లో ఫలితాలు, గ్రామాల్లో ప్రభుత్వ పథకాలపై కొరవడిన అధికారుల పర్యవేక్షణ తదితర అంశాలపై సభ్యులు ప్రశ్నించారు. అన్ని శాఖల మండల స్థాయి అధికారులు నిత్యం మండల కేంద్రంలో అందుబాటులో ఉంటూ జవాబుదారీతనంగా విధులు నిర్వహించాలన్నారు. సమావేశానికి గైహజరైన అధికారులపై సంబంధిత శాఖల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ సీతమ్మ మాట్లాడుతూ మండల స్థాయి అధికారులు శాఖల వారీగా జరుగుతున్న అభివృద్ధి పనులను కచ్చితంగా స్థానిక సర్పంచ్, ఎంపీటీసీలకు తెలియజేయాలన్నారు. కార్యాలయం ఎదుట గిరిజన సంఘం ఆధ్వర్యంలో పలువురు తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆందోళన చేశారు. దీనిపై స్పందించిన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ సాయికృష్ణ, ఎంపీడీవో రమేష్, తహసీల్దార్ నర్సమ్మ తాగునీటి సమస్య పరిష్కరిస్తామని హామీ పత్రం ఇవ్వడంతో ఆందోళన విరమించారు. వైస్ ఎంపీపీలు సత్యనారాయణ, భాగ్యవతి, ఎస్‌ఐ రవీంద్ర, వెలుగు ఏపీఎం దేవమంగ, పశు వైద్యాధికారి సౌజన్య దేవిలతో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా కొత్తమ్మతల్లి జాతర

ఎస్.రాయవరం : వెంకటాపురం గ్రామంలో కొత్తమ్మతల్లి జాతర మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. వేకువ జామునుంచి అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించడంతో పాటు రైతులు తమ పొలాల్లో పండిన కొబ్బరి, చెరకు, మామిడి వంటి ఫలాలను నైవేద్యంగా సమర్పించారు. మరికొందరు ఆచార సంప్రదాయాలతో అమ్మవారి చీర సారె సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణంలో భక్తులు కిక్కిరిసారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం గ్రామంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. రాత్రి భారీ మందుగుండు సామాగ్రి వెలిగించి, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి


హుకుంపేటలో చెత్త తొలగింపు పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ పూర్ణిమ

హుకుంపేట: పరిసరాల పరిశుభ్రత తప్పనిసరిగా చేపట్టాలని హుకుంపేట సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ అన్నారు. మండల కేంద్రంలోని ఆమె క్లాప్ మిత్రలతో కలిసి గురువారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. పరిసరాల్లో చెత్త, చెదారాలను తీయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల కేంద్రంలోని పలు ప్రాంతల్లో చెత్తా, చెదరాలు అధికంగా ఉన్నాయని, వీటిని అరికట్టే భాధ్యత అందరికీ ఉందన్నారు. ఇళ్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పంచాయతీ కేంద్రంలో ఏర్పాటు చేసిన డస్ట్‌బీన్‌లను ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పాల్గొన్నారు.

వేసవి శిబిరంలో రామాయణం

రాంబిల్లి : దిమిలి శాఖా గ్రంథాలయంలో గురువారం వేసవి శిక్షణ శిబిరంలో రీసోర్స్ పర్సన్ కె.వాసవి రామాయణంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు క్లుప్తంగా రామాయణం మహాగాథను క్లుప్తంగా వివరించారు. క్రమశిక్షణ, సమాజంలో ఎలా వుండాలో మహిళా పోలీస్ వెంకటలక్ష్మి వివరించారు. రీసోర్స్‌పర్సన్ జి. నూకినాయుడు నీతి కథలు చెప్పారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ ఎస్.శకుంతల పాల్గొన్నారు.

ఆదివాసీ జేఏసీ నూతన కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన కార్యవర్గ సభ్యులను అభినందిస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

అరకులోయ రూరల్: మండల కేంద్ర గిరిజన ఉద్యోగుల సంఘం భవనంలో అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి నందొ ఆధ్వర్యంలో గురువారం ఆదివాసీ జేఏసీ నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. కమిటీ గౌరవ అధ్యక్షుడిగా పి.రాము, అధ్యడిగా ఎస్.గోపాల్, ప్రధాన కార్యదర్శిగా శెట్టి అశోక్, కార్యదర్శిగా మోహన్, కోశాధికారిగా రాజ్‌కుమార్, కో-కన్వీనర్లుగా ఆనంద్, ప్రసన్నకుమార్, సహదేవ్, రాంచందర్, కార్యవర్గ సభ్యులుగా 12 మందిని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షక్ష కార్యదర్శులు గోపాల్, అశోక్ మాట్లాడుతూ ఆదివాసీ సమస్యల పరిష్కారానికి సంఘం తరపున తమ వంతు కృషి చేస్తామన్నారు. నూతన కార్యవర్గ సభ్యులకు అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు అభినందనలు తెలిపారు.

పెట్రోల్ బంకులో మొదలైన అమ్మకాలు

సాక్షి ఎఫెక్ట్..


బంకులో పెట్రోల్ అమ్మకాలు చేస్తున్న దృశ్యం

గూడెంకొత్తవీధి: మండల కేంద్రంలోని జీసీసీ పెట్రోలు బంకులో అమ్మకాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. పెట్రోలు బంకులోని పైపులైన్‌లో ఏర్పడిన సాంకేతిక సమస్యల వల్ల మూడు రోజులుగా పెట్రోలు అమ్మకాల నిలిచిపోయాయి. దీంతో బయట పెట్రోలు విడిగా కొనలేక వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై గురువారం 'సాక్షి'లో 'వాహనచోదకులకు తప్పని ఇక్కట్లు' శీర్షికతో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. దీనిపై జీసీసీ బ్రాంచ్ మేనేజరు మల్లేశ్వరరావు స్పందించి తక్షణమే సాంకేతిక సమస్యను పరిష్కరించారు. ఈ కారణంగా యధావిధిగా పెట్రోలు అమ్మకాలు కొనసాగాయి. దీనిపై వాహనచోదకులు, స్థానికులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు. జీసీసీ యాజమాన్యానికి హర్షం వ్యక్తం చేశారు.

గిరిజన గ్రామాల రహదారులకు మోక్షం

- తుమ్మనవలస- గంగవరం రోడ్డు సుగమం
- రూ.50 లక్షలతో తారురోడ్డు నిర్మాణం


గంగవరం గ్రామానికి వేసిన తారురోడ్డు

అనంతగిరి: ప్రస్తుతం ఏజెన్సీలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. శివారు గ్రామాల్లో అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తోంది. మారుమూల గ్రామాల్లో కూడా రహదారుల నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. ఫలితంగా గిరిజనులకు మెరుగైన రవాణా సదుపాయం కలుగుతోంది. గిరిజన ప్రాంతంలోని ప్రధానమైన సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం పెద్ద ఎత్తున కృషి చేస్తోంది. అందుకు నిదర్శనం... మండలంలోని కొత్తూరు పంచాయతీ గంగవరం గ్రామమే.. గతంలోని రహదారి సౌకర్యం లేకపోవడంతో గ్రామానికి వెళ్లేందుకు గిరిజనులు నరకయాతన అనుభవించేవారు. గత టీడీపీ హయాంలో పాలకులు, అధికారులకు పలుమార్లు వినతులిచ్చినా ఫలితం లేకుండా పోయిందని గ్రామస్తులు చెబుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక గంగవరం గ్రామ రహదారి మోక్షం కలిగింది. తుమ్మవలస నుంచి గంగవరం గ్రామానికి జాతీయ ఉపాధి హామీ పథకంలోని సుమారు రూ.50లక్షలతో 1.26 కిలోమీటర్లు తారురోడ్డు నిర్మాణానికి కృషి చేసిందన్నారు. గ్రామానికి వెళ్లేరహదారి మోక్షం కలగడంతో గిరిజనులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

నాణ్యత ప్రమాణాలతో రోడ్డు నిర్మాణం

నాణ్యత ప్రమాణాలతో గంగవరం తారురోడ్డు నిర్మాణ పనులు చేపట్టాం. రహదారులు లేని గ్రామాలపై ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లాం. నిధులు మంజూరు కాగానే పనులు చేపట్టే విధంగా కృషి చేస్తాం.

– గణేష్, ఏఈ ట్రైబల్ వెల్ఫేర్, అనంతగిరి

వేడుకగా వెంకన్న పెళ్లిరాట


స్వామివారి పెళ్లిరాట వేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు


తోడపెద్దు పాలుకొలుపు రాట మహోత్సవం

మాడుగుల రూరల్: కె.జె.పురం జంక్షన్‌లోని కల్యాణ వేంకటేశ్వర స్వామివారి 13వ వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం పెళ్లిరాట వేశారు. శాస్త్రోకంగా జరిగిన ఈ కార్యక్రమంలో దేవాలయ వ్యవస్థాపక కమిటీ చైర్మన్ రాపేట రామకొండలరావు మాస్టారు, ఉపాధ్యక్షుడు కాళ్ల అప్పలనాయుడు, కోశాధికారి పుట్టా బలరామూర్తి, సభ్యులు కాళ్ల నర్సింగరాజు, రాపేట బాబూరావు, యల్లపు రాము, ఆడారి శ్రీను మాస్టారు పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 30న స్వామివారి అంకురార్పణ, నిజరూప దర్శనం, 31న స్వామివారి ఎదురుసన్నాహం, అనంతరం కల్యాణం, అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. వచ్చే నెల 4వ తేదీతో పుష్పాంజలి సేవ, నాగవల్లి ఉత్సవాలతో ముగిస్తాయన్నారు.

భక్తి శ్రద్ధలతో రాట మహోత్సవం

మునగపాక : వాడ్రాపల్లిలో తోడపెద్దు పాలుకొలుపు కార్యక్రమంలో భాగంగా గురువారం రాట మహోత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ నెల 26 రాత్రి అలాగే 27వ తేదీన గ్రామంలో తోడపెద్దు పాలుకొలువు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. 12 సేవగరిడీలు పాలుకొలువులో పాల్గొననున్నాయని నిర్వాహకులు తెలిపారు. అలాగే 27వ తేదీన గ్రామంలో భారీ అన్న సమారాధన ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తులు రెండు రోజుల పాటు జరిగే కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని నిర్వాహకులు కోరుతున్నారు.

రైతులకు రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

కశింకోట : మండలంలోని రైతులకు ఖరీఫ్ సీజన్‌లో పచ్చిరొట్ట ఎరువు కోసం జీలుగ, జనుము , పిల్లి పెసర విత్తనాలు రాయితీపై పంపిణీకి సిద్ధంగా ఉన్నట్టు మండల వ్యవసాయ అధికారి స్వప్న గురువారం తెలిపారు. పది కిలోల జీలుగ రూ.395, జనుం రూ.420, 8 కిలోల పిల్లి పెసర రూ.388 వంతున పంపిణీ చేస్తామన్నారు. వీటి కోసం సంబంధిత రైతు భరోసా కేంద్రాల్లో ఆధార్ కార్డుతో విత్తనాల ధర చెల్లించి, తమ పేర్లను నమోదు చేసుకుంటే చాలన్నారు. నమోదు చేసుకున్న వారిని వారు కోరుకున్న మేరకు విత్తనాలు అందిస్తామన్నారు.

ఉపాధ్యాయుల్లో బదిలీల కోలాహలం


బదిలీల కోసం దరఖాస్తు చేసుకుంటున్న ఉపాధ్యాయులు

నక్కపల్లి : విద్యాశాఖ ఇటీవల చేపట్టిన ఉపాధ్యాయుల బదిలీల హడావుడి ఊపందుకుంది. బదిలీలు కోరుకునే ఉపాధ్యాయులకు మండల పీఆర్టీయూ అధ్యక్ష, కార్యదర్శులు టి.వి.రమణ, ప్రగడ శివాజీల ఆధ్వర్యంలో స్థానిక హెచ్‌సీ పాఠశాలలో ఉచితంగా పలు సేవలందిస్తున్నారు. దీనిలో భాగంగా రేపటితో దరఖాస్తు గడువు ముగుస్తోంది. గురువారం 70 మంది ఉపాధ్యాయులకు దరఖాస్తు చేసే కార్యక్రమం చేపట్టారు. బదిలీలపై ఉపాధ్యాయులలో నెలకొన్న సందేహాలను వెంటనే నివృత్తి చేయాలని మండల పీఆర్టీయూ నాయకులు పేర్కొన్నారు. ఈ సేవలతో పాటు మండలంలో అపరిష్కృతంగా ఉన్న ఏపీజీఎల్ఐ, పీఎఫ్ వంటి సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టి వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని, ఈ వేసవి సెలవుల్లోనే వాటిని పరిష్కరించే విధంగా కృషి చేస్తామని వారు ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు డి.వి.సన్యాసిరావు, ఎస్.రమేష్, టి.గోపీ, రవిప్రసాద్, బాషా పాల్గొన్నారు.

ధర్మ పరిరక్షణకు తోడ్పడాలి


అప్పన్నపాలెంలో ధర్మ ప్రచార ర్యాలీ

రాంబిల్లి : ధర్మ పరిరక్షణకు అందరూ తోడ్పాటునందించాలని సమరసత ఫౌండేషన్ డివిజన్ కన్వీనర్ కె.అప్పారావు అన్నారు. అప్పన్నపాలెంలో గురువారం ఇంటింటా ధర్మప్రచారం నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి స్టిక్కర్లు, కరపత్రాలు అందజేశారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించాలని అప్పారావు కోరారు.

బాక్సింగ్ క్రీడాకారిణులకు అభినందన

నర్సీపట్నం: బాక్సింగ్ క్రీడాకారిణులను ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తన క్యాంపు కార్యాలయంలో గురువారం అభినందించారు. యూత్ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ టోర్నమెంట్‌లో ఉమెన్ బాక్సర్లు యర్రా తేజస్విని, బొంతు మౌనిక బంగారు పతకాలు సాధించారు. వీరికి ఎమ్మెల్యే జ్ఞాపికలు అందజేసి అభినందించారు. జాతీయ స్థాయిలో పతకాలు సాధించి నర్సీపట్నం నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీనియర్ బాక్సర్ ప్రియాంక, డైరెక్టర్ పారుపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గమ్మతల్లి పండగ


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

యలమంచిలి : యలమంచిలి మున్సిపాలిటీ యర్రవరం గ్రామంలో దుర్గమ్మతల్లి పండగ గురువారం ఘనంగా జరిగింది. అమ్మవారిని స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఎంపీపీ గోవింద్ దర్శించుకుని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరావు, అర్రెపు గుప్త కౌన్సిలర్ పిట్టా సత్తిబాబు, దూది నర్సింహమూర్తి, పట్టణ వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు యర్రయ్యదొర, రూరల్ పార్టీ అధ్యక్షుడు కొల్లి త్రినాథ్ పాల్గొన్నారు.

మరిడిమాంబకు ప్రత్యేక పూజలు

కె.కోటపాడు: సూదివలస గ్రామదేవత మరిడిమాంబ అమ్మవారి పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రతీ ఐదేళ్లకోమారు అమ్మవారి పండగను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.